క్లుప్తంగా

వేరుశనగ కాయలు పంపిణీ



రైతులకు వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న అధికారులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో రైతులకు కావాల్సిన వేరుశనగ కాయలను పంపిణీ చేశామని వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి తెలిపారు. మండలానికి సంబంధించి 200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి, ఉలిమెల్ల గ్రామాలకు సంబంధించి 289 బస్తాల వేరుశనగ కాయలు పంపిణీ చేశామన్నారు. 5 ఎకరాలలోపు విస్తీర్ణం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై శిక్షణ

పెద్దముడియం : 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన నిర్వహణపై పెద్దపసుపుల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో ఎంఈవో శివజ్యోతి వంట మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేయాలని సూచించారు. వంట గది,వంట పదార్థాలు,పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.అదే విధంగా వంట నిర్వాహకులు వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం అవుతాయని తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చక్రాయపేట : ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. 40 సంవత్సరాల వయస్సులోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదంటే 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఒక సెట్ జిరాక్స్ పత్రాలు తీసుకు వస్తే తమ కళాశాల నుంచి ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9491056605, 9949621608 నంబర్లను సంప్రదించాలన్నారు.

హృదయానికి గిలిగింతలు... ఎంకి పాటలు

కడప కల్చరల్ : నండూరి సుబ్బారావు ఎంకిపాటలు హృదయానికి గిలిగింతలు పెడతాయని, ఆ మాధుర్యాన్ని మరీమరీ ఆస్వాదించాలనిపిస్తుందని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. నండూరి సుబ్బారావు 67వ వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం వారు బుధవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎంకి పాటలు తెలుగు సాహిత్యంలో ప్రణయం, బావుకత, పదాల పొందికకు కొత్త అందాలు చేకూర్చాయన్నారు. కవి వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ 1926లో ప్రచురితమైన ఎంకి పాటలు పెద్ద దుమారం లేపాయని, ఎంకి పాటలు చదివితే ఎవరైనా కూని రాగాలు తీయాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగయ్య, బాల ఓబయ్య, తబలిస్టు గంగయ్య, జ్యోతి జార్జి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం ప్రాధాన్యతను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యాదానం ప్రాధాన్యతను గుర్తించి చదువుకున్న ప్రతి ఒక్కరూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని స్పెడ్ స్మైల్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు శైలాభాను తెలిపారు. బుధవారం జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యాదానానికి మించి దానం మరొకటి లేదన్నారు. చదువుకుని విద్యావంతులైతే సమాజంలోని మంచి చెడులను తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. ఇలాంటికార్యక్రమాల ద్వారా నిరక్షరాస్యతను నిర్మూలించవచ్చన్నారు. అనంతరం సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, వలంటీర్ సుజితాదేవి చదువుకు గల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, సంస్థ సభ్యులు రోహిత్, యుగంధర్, నిఖిత, వసంత, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిరాఫీ చెస్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు జిరాఫీ చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల లైబ్రేరియన్ గంగాధర్‌రెడ్డి, విశ్రాంత వైమానిక దళ అధికారి కొండయ్య, పాఠశాల సిబ్బంది రెహ్మాన్‌ఖాన్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

- ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు
- ప్రతి నెలా గ్రామీణ , మండల స్థాయిల్లో టోర్నమెంట్ నిర్వహణ
- మూడు నెలలకోసారి జిల్లా స్థాయిలో ఇంటర్ క్లబ్ పోటీలు



ఎర్రగుంట్ల జెడ్పీ బాయ్స్ పాఠశాల



క్రీడలలో సాధించిన వివిధ పతకాలు

ఎర్రగుంట్ల : ప్రతి ప్రభుత్వ పాఠశాలలో క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లాస్థాయిలో ఏదైనా క్రీడలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటే తప్పా ప్రోత్సాహం ఉండేది కాదు. ఇప్పుడు క్రీడలపై ఆసక్తి గల ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణిస్తున్నారు.

ప్రణాళికతో ఏర్పాటు..

ఒక్కో క్రీడకు ఒక్కో క్లబ్ చొప్పున.. మొత్తం గ్రామంలో 26 క్రీడాంశాలపై జగనన్న క్రీడా క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, పాలకమండలి సభ్యులతో కార్యకలాపాలు సాగించేలా రూపకల్పన చేస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి మండల, నియోజవర్గ, జిల్లా స్థాయిల్లో స్పోర్ట్స్ క్లబ్‌లు పోటీలు నిర్వహించేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇప్పటికే శాప్ అధికారులు స్పోర్ట్స్ క్లబ్‌ల రిజిస్ట్రేషన్‌ను ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతోంది.

పీఎస్ఏ, ఎంఎస్ఏ పర్యవేక్షణ..

గ్రామాల్లోని స్పోర్ట్స్ క్లబ్‌లను పంచాయతీ స్పోర్ట్స్ ఆథారిటీ (పీఎస్ఏ), మండలస్థాయిలో మండల స్పోర్ట్స్ ఆథారిటీ (ఎంఎస్ఏ) పర్యవేక్షించనున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో నిధులు సమకూర్చుకుంటూ ఈ క్లబ్‌లు క్రీడా కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. సర్పంచ్‌గా చైర్మన్‌గా ఉండే పీఎస్ఏలో పంచాయతీ సెక్రటరీ, గ్రామానికి చెందిన జిల్లాస్థాయి క్రీడాకారుడు లేదా క్రీడాభివృద్ధికి ముందుకు వచ్చే దాత, స్థానిక హైస్కూల్ పీఈటీ సభ్యులుగా ఉంటారు. ఎంపీపీ చైర్మన్‌గా ఉండే ఎంఎస్ఏలో తహసీల్దార్, ఎంఈఓ, ఎస్ఐ మండల ఇంజనీరు, ఎంపీడీఓ, పిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ , హెచ్ఎం, మండలం నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన పురుష, మహిళా క్రీడాకారులు (ఒక్కొక్కరు), సర్వస్వచ్ఛంద సేవకులు సభ్యులుగా ఉంటారు.

తరుచుగా టోర్నమెంట్ల నిర్వహణ..

గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ క్రీడా క్లబ్‌లు పనిచేస్తాయి. ప్రతి నెల గ్రామీణ, మండల స్థాయిలో టోర్నమెంట్లు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ గల వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయిలో ఇంటర్ క్లబ్‌లు పోటీలు నిర్వహిస్తారు.



ఫుట్‌బాల్ క్రీడలో విజేతలు(ఫైల్)



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి

చక్రాయపేట : హనుమజ్జయంతి సందర్భంగా జూన్ 1న మండలంలో నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మోపూరు రామాంజనేయరెడ్డి తెలిపారు. శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈశోభా యాత్ర గండి వీరాంజనేయస్వామి సన్నిది నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అక్కడి నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను అనుసంధానం చేస్తూ చక్రాయపేటలోని శ్రీవేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయాల వద్ద శోభాయాత్ర ముగుస్తుందన్నారు. శోభా యాత్రలో పాల్గొనే ప్రతి హిందువు తమ మోటార్ సైకిల్ గాని, కారు గాని తీసుకు రావాలని తెలిపారు. ఇందుకు అవసరమైన హనుమాన్ జెండాలు, కాషాయ కండువాలను గండి వద్ద అందజేస్తామన్నారు. ప్రతి హిందు బంధువు ఈశోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జూన్ 1న వేంపల్లెలో నగర సంకీర్తన

వేంపల్లె : జూన్ 1వ తేదీ హనుమత్ జయంతి సందర్భంగా వేంపల్లెలోని శ్రీ ఆంజనేయస్వామి భజన బృందం ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించనున్నట్లు ఆంజనేయస్వామి భజన బృందం తెలిపారు. ఉదయం 5 గంటలకు మెయిన్ బజార్‌లోని దేవస్థానం నుంచి అమ్మవారిశాల మీదుగా పప్పుల బజార్, గాంధీరోడ్డు, కడప రోడ్డు, సుబ్రమణ్యం స్వామి గుడి, గాండ్ల వీధి, పాతపేట మీదుగా నగర సంకీర్తన ఉంటుందని తెలిపారు. వేంపల్లె, మండల ప్రజలందరు ఈ నగర సంకీర్తనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సుంకులమ్మ నవమ బ్రహ్మోత్సవ తిరునాల మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రముఖ వేద పండితులు పవన్‌కుమార్ ఆచారత్వమున మూలమూర్తికి ఉత్సవ విగ్రహములకు అభిషేకము, తదుపరి ఆవాహిత హోమాలు, విశేషంగా చండీ హోమము, అభిషేకాలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. పట్టణం నుంచే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదా లు పంచి పెట్టారు. సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చవ్వారెడ్డి రామ్ ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, పిచ్చిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే కింగ్ మేకర్లు..

- అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్న మహిళలు
- నియోజకవర్గంలో పోలైన ఓట్లు 2,10,241
- పురుషులు 1,02,256
- మహిళలు 1,07,449



ఇల్లూరులో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు (ఫైల్)

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మహిళల ఓట్లే గెలుపోటములు శాసించనున్నాయి. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలలో మొత్తం 2,42,556 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,17,746, మహిళలు 1,24,795 మంది ఉన్నారు. ఇందులో పోలైన ఓట్లు తీసుకుంటే 2,10,241. ఇందులో పురుషులు 1,02,256, మహిళలు 1,07,449 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు దాదాపు 5,193 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎర్రగుంట్ల మండలంలో తీసుకుంటే ప్రతి పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తే మహిళలే ఎక్కువగా ఓట్లు వేశారు. జమ్మలమడుగు మండలం పరిధిలో కూడా మహిళలే అధికంగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ముద్దనూరు, కొండాపురం, మైలవరం, పెద్దముడియం మండలాల్లా కూడా ఏ పోలింగ్ కేంద్రాలను పరిశీలించినా మహిళలే అధికంగా ఓట్లను వేశారు.

వైఎస్సార్‌సీపీ వైపే మహిళలు మొగ్గు..

నియోజకవర్గంలోని పలు మండలాల్లోని పురుషుల కంటే మహిళలే వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా పింఛన్లు తీసుకునే వృద్ధులు, 45–60 సంవత్సరాల్లోపు మహిళలు, వితంతువులు, అమ్మ ఒడి పొందిన మహిళలు అధికంగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినట్లు సమాచారం, పొదుపు సంఘాల గ్రుపు సభ్యులు కూడా మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. పురుషుల్లో చాలా మంది వివిధ వర్గాలుగా ఓటు వేసినట్లు సమాచారం. చోటా నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో లబ్ధి పొంది కూడా వారి స్వార్థం కోసం పార్టీలు మారిన వారి ఇళ్లలోని మహిళలు కూడా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపినట్లు సమాచారం.

హనుమజ్జయంతి సందర్భంగా పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : జూన్ 1వ తేదీన హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆవిష్కరించారు. పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో జూన్ 1వ తేదీన హనుమాన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, హిందూ ధర్మప్రచార సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి ఈ వేడుకలలో పాల్గొనాలని వారు కోరారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన చేతుల మీదుగా ప్రారంభించి ప్రదర్శించారు.

యూరో కిడ్స్‌ప్రీ స్కూల్ ప్రారంభం

పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో చిన్నారుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన యూరో కిడ్స్ ప్రీ పాఠశాలను బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం శేషసాయికుమార్, శేషసాయి నిఖిల్‌లు ఎంపీని సాదరంగా ఆహ్వానించి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు అన్ని హంగులతో ఏర్పాటు చేసిన పాఠశాలలో మంచి విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ శరణ్య, శ్రీరామసుబ్బయ్య, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హిమాంబి, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, నూరుబషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, కౌన్సిలర్లు, జేసీఎస్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమంలో జాగ్రత్తలు తప్పనిసరి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

వేముల : నెలసరి సమయంలో పరిశుభ్రత, జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శరణ్య, సీడీపీఓ సునీతలు తెలిపారు. స్థానిక 5వ అంగన్‌వాడీ కేంద్రంలో రుతుక్రమం, పరిశుభ్రత దినోత్సవంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగహింస, లింగ నిష్పత్తి గురించి మహిళలకు వివరించారు. నెలసరి సమయంలో కిశోర బాలికలు పాటించాల్సిన అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తూ వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం హసీనా, అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం , చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరిశోధక విద్యార్థికి డాక్టరేట్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర పరిశోధక విద్యార్థి ఎం. కిరణ్‌కిశోర్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ జంతుశాస్త్ర శాఖ సహ ఆచార్యులు డా. ఎ.టి. వెంకటరమణా రెడ్డి పర్యవేక్షణలో ×కాంప్రెహెన్సివ్ స్టడీ ఆఫ్ ది ఇంపాక్ట్ ఆఫ్ కాడ్మియం టాక్సిసిటీ ఆన్ ఫిష్, లెబియోరోహిట€ అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈయనకు పలువురు అభినందనలు తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ, పిఎస్‌వైఎఫ్, టీఆర్ఎస్ విద్యార్థి, యువజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగు రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ జయరాజ్‌లు మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆదే విధంగా జీప్లస్ 2 ఉండాల్సిన బిల్డింగ్ పర్మిషన్ జీ ప్లస్ 5 వరకు ఏర్పాటు చేసుకుని అక్రమ సంఖ్యలో విద్యార్థులను చేర్పించుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా అడ్మిషన్ ఫీజు పేరుతో ఒకొక్కరి వద్ద నుంచి రూ.3 వేల నుంచి రూ. 5 వేల వరకు అక్రమంగా లాక్కుంటున్నారన్నారు. దీంతోపాటు స్కూల్ బస్సుల్లో కూడా అధిక సంఖ్యలో పిల్లలను ట్రావెల్ చేస్తున్నారన్నారు. వీటన్నింటిపైన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల సమగ్ర సర్వే

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో బుధవారం ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి ఆధ్వర్యంలో దివ్యాంగుల సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర విద్యార్థుల వలే మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో దివ్యాంగుల సమగ్ర సర్వే సాగుతుందన్నారు. ప్రతి బుధవారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయించడం లాంటి కార్యక్రమాలతోపాటు అవసరమైన పరికరాలను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు.

ప్రత్యేక అవసరాలుగల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాలుగల పిల్లల వివరాలు తెలుసుకుంటున్న ఐఈఆర్‌పీలు

చింతకొమ్మదిన్నె : ప్రత్యేక అవసరాలుగల పిల్లలను గుర్తించి వారికి బంగారు భవిత కల్పించడానికి మండల విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష సహకారంతో ఐఈఆర్‌పీలు ఎస్.షాకీరాబేగం, ఎం.వసుధ బుధవారం సర్వే చేపట్టారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు గతంలో కంటే ఎక్కువగా ఉన్నారని భావిస్తూ వారికి కూడా బంగారు భవిష్యత్తు అందించడానికి చర్యలు తీసుకున్నారు. ఇలాంటి పిల్లలకు విద్యార్థి దశలో విద్యాబుద్ధులు నేర్పించే చర్యలు, ప్రతి బుధవారం ఫిజియోథెరపీ ఇప్పించి వారికి అవసరమైన పరికరాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈనెల ఒకటో తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఆయా మండలాల పరిధిలో పూర్తిస్థాయిలో అన్ని రకాల విభిన్న ప్రతిభావంతుల పిల్లలను గుర్తించే పనుల్లో నిమగ్నం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే బహిష్కరణ



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

తొండూరు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు సృష్టించినా, ప్రశాంతతకు విఘాతం కలిగించినా జిల్లా బహిష్కరణ తప్పదని డీఎస్పీ వినోద్‌కుమార్, ఎస్ఐ లక్ష్మినారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు విజయోత్సవాలు, సంబరాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బాణాసంచా కాల్చడం నిషేధించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు ఉంటే తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాజంలో ప్రశాంతత కొనసాగేందుకు పరస్పరం సహకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని సమాజంలో విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. నిబంధన అతిక్రమిస్తే తాటతీస్తామని హెచ్చరించారు. నేరస్తులపై, రౌడీషీటర్లపైన ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాజకీయాలపై బెట్టింగులు దుర్వ్యసనాలకు యువకులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టించే వారిపై నిఘా ఉంచండి

సింహాద్రిపురం : వచ్చే నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లు సృష్టించే వారిపై నిఘా ఉంచాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్‌కు సూచించారు. బుధవారం ఆయన సింహాద్రిపురం స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కౌంటింగ్ సందర్భంగా మండలంలో అప్రమత్తంగా ఉండి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐకి సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఇప్పటికే బైండోవర్ చేసిన వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని, కౌంటింగ్ అనంతరం జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ తెలిపారు.

కౌంటింగ్ రోజు దుకాణాలు తెరవరాదు



మాట్లాడుతున్న సీఐ పార్థసారథి

చెన్నూరు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు దుకాణ దారులు, హోటల్ యజమానులు 144 సెక్షన్ అమలులో ఉన్నందున దుకాణాలను, హోటళ్లను మూసివేయాలని సీఐ పార్థసారథి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో చెన్నూరులోని హోటల్ యజమానులకు, దుకాణదారులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజున జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దుకాణాలు, హోటల్ మూసివేయాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రజలు ఎవరు రోడ్లమీద గుంపులు గుంపులుగా ఉండరాదని, అల్లర్లకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక దుకాణదారులు, హోటల్ యజమానులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బేబి

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ బేబి తెలిపారు. బుధవారం స్థానిక జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించడంలో వంట ఏజెన్సీల పాత్రే కీలకం అన్నారు. మెనూ తప్పని సరిగా పాటించాలన్నారు. మెనూలోని పోషక విలువలు, సమతుల్య ఆహారం ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ ఆరు రోజుల మెనూ అంశాలను ఏ విధంగా తయారు చేయాలో వీడియోలు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. వంట చేసే ప్రాంతం శుభ్రంగా పెట్టుకోవాలని, అలాగే బియ్యం, కూరగాయలు శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలోనే భోజనం వడ్డించాలన్నారు. మధ్యాహ్న భోజనం అమలు విద్యార్థుల శాతాన్ని పెంచే విధంగా ఉండాలన్నారు. అన్ని పాఠశాలల వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.